
చింతూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య


అరకులోయలో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు మింగిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్


విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను మింగిస్తున్న హెచ్ఎం సుజాత, వైద్యాధికారి కుమార్ రత్న


ముంచంగిపుట్టులో విద్యార్థిని చేత నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం

- పాఠశాలల్లో డీ వర్మింగ్ డే
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేత


ఎటపాకల కేజీబీవిలో విద్యార్థినులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ కామేశ్వరి

చింతూరు: జిల్లా వ్యాప్తంగా జాతీయ డీ వర్మింగ్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను వేశారు. విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పొట్టలో ఉన్న నులిపురుగుల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. నులిపురుగులు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందుకోసం విద్యార్థులకు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయిస్తోందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.

పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యం

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులి పురుగులను నివారించవచ్చని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ నులి పురుగుల నివారణలో భాగంగా పిల్లలు, పెద్దలు ప్రతివారం గోర్లు కత్తిరించుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహారం తినేముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయవద్దన్నారు చింతూరు డివిజన్‌లో 19 ఏళ్లలోపు ఉన్న వారికి ఆల్బెండాజోల్ మాత్రలు మింగించినట్లు పీవో తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏటీడబ్ల్యూవో సుజాత, డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ విద్యార్థులకు డీవర్మింగ్ మాత్రలు అందజేశారు. ఎన్‌ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ కె.పుష్పరాజు, ఐటిఐసి కో–ఆర్డినేటర్ పి.కొండబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జాముగుడ వైద్యాధికారి కుమార్‌రత్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.హెల్త్ సూపర్ వైజర్ జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు రమేష్, శిరీషా తదితరులు విద్యార్థులకు డీవర్మింగ్ మాత్రలు అందజేశారు.వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, అశోక్, లలిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీపతిరాజు తదితరులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.సిబ్బంది శాంతమ్మ, నాయుడు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధిరాకి డాక్టర్ కోమలి విద్యార్థులకు డీవర్మింగ్ మాత్రలు అందజేశారు. సిబ్బంది శ్రీనివాసరావు, బాలరాజు, రోజీగోల్డ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటర్రామిరెడ్డి, డాక్టర్ విష్ణుప్రియ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.

రాజవొమ్మంగి: మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు యామిని ప్రియ, జీఎస్‌వీ నాగార్జున, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, వైద్యులు సుష్మా తదితరులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. సుధాకర్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారి భావన తదితరులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.హెచ్ఎం సత్యనారాయణ, సిబ్బంది శ్రీనివాస్, విజయలక్ష్మి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగరం ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్


పెదవలస పీహెచ్‌సీలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది


రాజవొమ్మంగిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర అందజేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి


గంగవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భావన

నేడు గ్రంథాలయాలు ప్రారంభం


పెదబయలులో గ్రంథాలయ భవనం


కొయ్యూరులో గంథాలయ భవనం

పెదబయలు: మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్నట్టు మండల గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండ రాజీవ్ గాంధీ పాల్గొని గ్రంథాలయం భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొవాలని కోరారు.

కొయ్యూరు: మండల కేంద్రంలో శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ శనివారం ప్రారంభించనున్నట్టు ఎంపీపీ రమేష్ తెలిపారు. రాజారామ్మోహన్ రాయ్ ఫౌండేషన్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ నూకరాజుతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నక్షత్ర శాంతి హోమం

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో లోకోద్ధరణ ఆకాంక్షిస్తూ శుక్రవారం నక్షత్ర శాంతి హోమం నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ లంకా అయ్యప్ప శర్మ పౌరోహిత్యంలో వినాయక పూజ, శివునికి అభిషేకం, గిరి దుర్గా భవానీ అమ్మవారికి, అనంతరం నవగ్రహాల విగ్రహాలకు పూజలు చేశారు. బాలాజీ స్వామి ఆలయానికి చేరుకునే మెట్లకు పసుపు, కుంకుమతో బొట్లుతో అలంకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య చెప్పారు.


పూజలు చేస్తున్న అర్చకుడు

12న వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం


విలేకరులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 12న నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు చెప్పారు. ఆయన మాట్లాడుతు రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ విజయానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న చైర్మన్లు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు అందరు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరంఅధ్యక్షుడు రామకృష్ణ, గెమ్మెలి సర్పంచ్ సీదరి కొండబాబు, నాయకులు శేఖర్, రమణ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

చింతపల్లిరూరల్: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన అన్నింటిల్లో రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు.మండల సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోళ్ల పెంపకం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చాన్నారు. ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కలిసి పనిచేస్తోందన్నారు . పసుపు, మిరియాలకు మార్కెట్‌ల్లో మంచి ధర ఉందన్నారు. ఉత్పత్తిదారులు సంఘాలు రైతులకు సహకరించి అధిక లాభాలు వచ్చేలా, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంతల రాజారావు, తాజంగి పశువైద్యాధికారి దమయంతి, పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాసరావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

చింతూరు: మండలంలోని చిడుమూరులో ఏడుగుర్లాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 144 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి 22 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 58 మందికి ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించగా, 53 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 70 మందికి రక్తపరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. సర్పంచ్ కాక అరుణకుమారి, గైనకాలజిస్టు డాక్టర్ రమణారావు, పిడియాట్రిషిన్ డాక్టర్ హర్ష, ఆప్తాలమిస్ట్ డాక్టర్ కిషోర్‌కుమార్, ఏడుగుర్లాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యులు విశ్వచైతన్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: జగనన్న సురక్ష గిరిజనులకు వరమని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. రింతాడలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. శిబిరాన్ని ఎంపీపీ కుమారి సందర్శించి, అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందితోపాటు సర్పంచ్ లక్ష్మి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు శివరత్నం, ఉపసర్పంచ్ సోమేష్, కార్యదర్శి అరుణ్ నాయకుడు గిరిప్రసాద్, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: చింతపల్లి సచివాలయ పరిధిలో అంతర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో గిరిజనులకు ప్రభుత్వం మేరుగైన వైద్యసేవలందిస్తోందన్నారు. శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. ఎంపీడీవో వీరసాయిబాబు, కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ ధారలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, వైద్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చింతూరులో మాట్లాడుతున్న డాక్టర్ రమణారావు


రింతాడలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ లక్ష్మి తదితరులు


అంతర్లలో శిబిరాన్ని పరిశీలిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత

గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు


పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తహసీల్దార్ శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని ఎండపల్లి, రామవరం, బి.శివరామట్నం, మర్రిపాలెం పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయన వెంట వీఆర్‌వో వెంకటేశ్వర్లుదొర ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేసిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు.మండలంలోని నెల్లిపూడి, మొల్లేరు పాఠశాలల అప్‌గ్రేడ్, ఈ–క్రాప్, కోతుల సమస్యలను మండల కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్ ప్రస్తావించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. సమస్యల పరిష్కారానికి మండల పరిషత్, పంచాయతీ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల సమావేశాలకు పలు ప్రభుత్వ శాఖల అధికారులు తరచూ గైర్హజరవుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మావతి, ఆదినారాయణ, డీటీ వీరభద్రరావు, గ్రామీణ పశువైద్యశాల అధికారి అప్పనబాబు, ఏవో విశ్వనాథ్, పిహెచ్‌సీ వైద్యాధికారి భావన, అటవీశాఖ అధికారి నూకరాజు, ఎంఈవో మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, చిత్రంలో జెడ్పీటీసీ బేబీరత్నం తదితరులు

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన


శిరిమెట్లలో వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: మండలంలోని శిరిమెట్ల, వలస గ్రామాల మధ్య కొండవాగుపై వంతెన నిర్మాణానికి శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి శంకుస్థాపన చేశారు. రూ. 3కోట్ల రూపాయలతో చేపట్టనున్న వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని బండిగడ్డ గ్రామం నుంచి చవిటిదిబ్బలు గ్రామానికి మూడున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు.

వేగవంతంగా గృహాల రిజిస్ట్రేషన్లు

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడు పంచాయతీ సచివాలయంలో శుక్రవారం అర్హులైన లబ్ధిదారుల గృహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నమోదు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి అద్రబారికి నిర్మల మాట్లాడుతు పంచాయతీ పరిధిలో మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 369 వైఎస్సార్ గృహాలు మంజూరైనట్టు చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. నాయకుడు రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు ఉచిత వాహన సదుపాయం

రాజవొమ్మంగి: రంపచోడవరంలో శనివారం జరగనున్న జాబ్‌మేళాకు మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్‌ల పరిధి నుంచి వెళ్లే అభ్యర్థుల కోసం ఉచిత వాహన సదుపాయం కల్పించినట్టు ఎస్‌ఐ వెంకయ్య తెలిపారు. మండలంలోని 53 మంది ఈ ఇంటర్వ్యూల కోసం పేర్లు నమోదు చేసుకొన్నట్టు చెప్పారు. వారంతా శనివారం ఉదయం 7 గంటలకు ఆయా పోలీస్‌స్టేషన్ల వద్ద సిద్ధంగా ఉండాలని కోరారు. జాబ్‌మేళా ఇంటర్వ్యూలకు సంబంధించిన అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అభ్యర్థులు వెంట తీసుకురావాలని సూచించారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘ నేత బాలదేవ్

అరకులోయ రూరల్: డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే గిరిజన అభ్యర్థుల కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలని కోరారు. నాయకులు బుజ్జిబాబు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ


చీరలను పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థ అధినేత అశోక్‌రెడ్డి

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కేంద్రంలోని శుక్రవారం పీవీటీజీలకు గుంటూరుకు చెందిన బండి సాహితిరెడ్డి చారిటబుల్ ట్రస్టు అధినేత బండి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. పేదవారికి ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ట్రస్టు సభ్యులు శ్రీనివాసరెడ్డి, తారకరామ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సభ

సాక్షి, పాడేరు: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 10వ తేదీ శనివారం చింతపల్లిలో పర్యటించనున్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మధ్యాహ్నం జరిగే బహిరంగ సభలో ఆమె పాల్గొంటారని, ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పాడేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వంతాల సుబ్బారావు తెలిపారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మారేడుమిల్లి: మారేడుమిల్లి గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సి.ఆర్. రెడ్డి కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్స్ సైన్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్, రుతుస్రావం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆరోగ్య అంశాలను వివరించారు. ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇబ్బందులుంటే తక్షణమై వైద్య సేవలు పొందాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, మోహన్, శైలజ, శాంతిప్రియ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

దేవీపట్నం: మండలంలో శనివారం వైఎస్సార్ వాహనయాత్ర నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీఅనంతబాబు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. ఫజుల్లాబాద్‌లో ఉదయం 10.30కు వాహన యాత్ర ప్రారంభమవుతుంది. ఇందుకూరు, పోతవరం, శరభవరం వరకు సాగుతుందని చెప్పారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మాజీ సర్పంచ్ లుథియా మృతికి సంతాపం

సాక్షి,పాడేరు: పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ జన్ని లుథియా (78) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు.ఆమె మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ సభ్యులు సంతాపం తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మారేడుమిల్లి: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు వై.హరికృష్ణ, శిరిష మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు రక్తపరీక్షలు, స్కానింగ్, పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పీహెచ్‌సీ సిబ్బంది బిస్కెట్లు, పండ్లు అందజేశారు. సీహెచ్‌వో శకుంతల, హెచ్‌వీ సత్యవతి పాల్గొన్నారు.